క్లుప్తంగా

శరవేగంగా సీసీ రోడ్ల నిర్మాణం



బురుజులలో రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మద్దికెర: మండల పరిధిలోని బురుజుల గ్రామంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేస్తున్నట్లు కార్యదర్శి హరికృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు జయభరత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పలు వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సహకారంతో సచివాలయం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే సీసీ రోడ్ల పనులు పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ చంద్రశేఖర్ ఉన్నారు.

పెరటి కోళ్ల పంపిణీ



ముగతిలో పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ లక్ష్మీదేవమ్మ, సర్పంచ్ విరుపాక్షిరెడ్డి

నందవరం: పొదుపు మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందిస్తోందని ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మ పేర్కొన్నారు. మంగళవారం ముగతి గ్రామంలో సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, వైకేపీ ఏపీఎం చిన్నవీరన్న ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. మహిళలకు జీవనోపాధి కల్పించడంతో పాటు అదనపు ఆదాయం పొందేలా ప్రభుత్వం పెరటి కోళ్లను పంపిణీ చేసిందన్నారు. గ్రామంలో పొదుపు మహిళలకు 100 యూనిట్ల పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాముడు, మండల సమైఖ్య సభ్యులు, సీసీలు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలసిన బొజ్జమ్మ



కలెక్టర్‌ను కలిసి బొకే అందజేస్తున్న బొజ్జమ్మ, రామచంద్రనాయుడు

కర్నూలు(సెంట్రల్): వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఆమె భర్త రామచంద్రనాయుడు మంగళవారం కలెక్టర్ డాక్టర్ జి.సృజనను ఆమె కార్యాలయంలో కలిసి బొకే అందజేశారు. పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. హంద్రీనీవా కాలువకు ఎక్కువ రోజులు నీళ్లిచ్చి రైతుల పంటలను కాపాడాలని కోరారు.

ఓటరు జాబితా సవరణలో నిర్లక్ష్యం వద్దు

ఆలూరు రూరల్: ఓటరు జాబితా సవరణలో నిర్లక్ష్యం వహించవద్దని ఆలూరు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి మల్లికార్జున ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముసాయిదా ఓటరు జాబితాలో తప్పులు ఉంటే ఆయా పోలింగ్ కేంద్రాల బీఎల్‌ఓలను సంప్రదించి సరిచేసుకోవాలన్నారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారందరూ ఓటు హక్కు పొందాలని సూచించారు. పేరు, చిరునామా, వయసు మార్పు ఉన్న ఓటర్లు ఆన్‌లైన్ లేదా నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో ఫారం-7 అందించి తప్పులు సరిచేసుకోవాలని సూచించారు. ఏఈఆర్వో రామాంజినేయులు, ఎన్నికల డీటీ గుండాల్‌నాయక్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ బసన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హాలహర్వి: ఓటరు జాబితా సవరణపై బీఎల్‌వోలు నిర్లక్ష్యం వహించకుండా సక్రమంగా విధులు నిర్వహించాలని తహసీల్దార్ మల్లికార్జున అన్నారు. మంగళవారం హాలహర్విలో బీఎల్‌వోలతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. అర్హులైన వారి నుంచి కొత్త ఓటు నమోదుకు దరఖాస్తు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులకు ఏమైనా ఫిర్యాదులు ఉంటే రాతపూర్వకంగా అందించాలని తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా మత్స్యకార దినోత్సవం

నందవరం: గంగపుత్రులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మత్స్యకార సంఘం పెద్దలు లింగమూర్తి, రంగారెడ్డి, పీబీ నరసింహులు అన్నారు. మంగళవారం నాగలదిన్నె గ్రామంలో మత్స్యకార దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా తుంగభద్ర నది తీరంలో కొలువుదీరిన గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై గంగమ్మ దేవి, భీష్మ మహార్షి చిత్రపటాలను ఉంచి గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. గ్రామంలోని గంగపుత్ర సంఘం యువకు లు గురజాల సర్కిల్ వద్ద భీష్మ మహర్షికి, గంగమ్మ దేవి చిత్రపటాలకు పాలభిషేకం చేసి మొక్కులు తీర్చుకున్నారు. మత్స్యకార సంఘం నాయకులు వీరేష్, పులికొండ, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి పట్టం కడదాం





ఎమ్మిగనూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, జీ.ఎర్రగుడిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ఎమ్మిగనూరుటౌన్: పేద బడుగు, బలహీన వర్గాలకు ప్రస్తుతం మంజూరవుతున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పిలుపునిచ్చారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని 14వ వార్డు సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు జన్మభూమి కమిటీల సిఫారసు మేరకు ఆ పార్టీ వారికే వర్తించేవన్నారు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీలు, కులం, మతం చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారని వివరించారు. సంక్షేమ పథకాలతో సమానంగా అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయాల నిధులు మంజూరు చేస్తూ రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తున్నారన్నారు. పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే మద్దతు ఇచ్చేలా కృషి చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వార్డు కౌన్సిలర్ పూజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: కటారుకొండ గ్రామంలో ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మాధవరావు, సొసైటీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డితో కలిసి గ్రామ సచివాలయంలో సంక్షేమ అభివృద్ధి బోర్డును అవిష్కరించారు. బస్టాండ్ సమీపంలో పార్టీ జెండాను ఎగురవేశారు. ఆ గ్రామ సచివాలయ పరిధిలో వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.23.45 కోట్లు అందించినట్లు వివరించారు.

ఆస్పరి: మండలంలోని తంగరడోణ సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును సర్పంచ్ శంకరమ్మ ఆవిష్కరించారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మన్న మాట్లాడుతూ.. సచివాలయం పరిధిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ. 30.70 కోట్లు లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. నాయకులు మూలింటి రాఘవేంద్ర, కట్టెల గోవర్ధన, బసవరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను పార్టీ మండల కన్వీనర్ పెద్దయ్య ఆవిష్కరించారు.

హాలహర్వి: మండలంలోని బిలేహాల్ గ్రామంలో జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ. 13,91,54,865 లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. అలాగే మూడు రోజుల క్రితం సహజ మరణం పొందిన నాగరాజు కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మంజూరైన రూ.10 వేలు నగదు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమప్పచౌదరి, ఎంపీటీసీ గోపాల్, ఈఓపీఆర్డీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: మండలంలోని మొలగవల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి, పార్టీ మండలాధ్యక్షుడు వీరేష్ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ రంగమ్మ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఈరన్న హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం సచివాలయం ఆవరణలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. వైస్ ఎంపీపీ శ్రీరాములు, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

నందవరం: మండల పరిధిలోని ముగతి గ్రామ సచివాలయం-2లో సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చాంద్‌బాషా ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి జాబితా బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో జెండా ఆవిష్కరించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ సచివాలయం-2 పరిధిలోని ప్రజలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.16.02 కోట్లు లబ్ధిపొందారని వివరించారు. తహసీల్దార్ నిత్యానందరాజు, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.



హంప గ్రామంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు

మద్దికెర: మండల పరిధిలోని హంప గ్రామంలో ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఉప సర్పంచ్ తిమ్మప్ప ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ గ్రామ సచివాలయం పరిధిలో వివిధ పథకాల ద్వారా రూ. 27.92 కోట్లు లబ్ధి చేకూర్చినట్లు వివరించారు.

జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం

తుగ్గలి: ప్రజా సంక్షేమం, రాష్ట్ర ప్రగతి కోసం చిత్త శుద్ధితో పనిచేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరాన్ని ప్రజలకు చాటి చెప్పాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. మంగళవారం జీ.ఎర్రగుడిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ప్రదర్శించారు. నాలుగున్నరేళ్ల జగన్న పాలనలో జీ.ఎర్రగుడి సచివాలయ పరిధిలోని ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా రూ.42.50 కోట్లు అందించినట్లు వివరించారు. ఇటువంటి మేలు టీడీపీ హయాంలో జరిగిందా అని ప్రజలు ఆలోచించాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రా రెడ్డి, నాగేష్, జగన్నాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, సర్పంచ్‌లు వరలక్ష్మి, బనావత్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



హెబ్బటంలో కరపత్రం అందిస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

హొళగుంద: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తూ వివక్ష లేని పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు గుమ్మనూరు ఈశ్వర్ పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం హెబ్బటం గ్రామంలో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. అలాగే సంక్షేమ క్యాలెండర్లు, రిసిప్ట్‌లను అందజేశారు. అంతకు ముందు సచివాలయంలో మాట్లాడుతూ.. జగనన్న పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, అలాంటి నాయకుడిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని కోరారు. హెబ్బటం గ్రామ పరిధిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ద్వారా రూ.25.48 కోట్ల వరకు ప్రయోజనం చేకూరిందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు మల్లికార్జున, శేషప్ప, అయ్యాళప్ప, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



దేవనకొండలో నవరత్నాల బుక్‌లెట్ అందజేస్తున్న జెడ్పీటీసీ రామకృష్ణ

దేవనకొండ: స్థానిక సచివాలయం-1 పరిధిలో జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున, కో-కన్వీనర్ కబీర్‌దాసు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



కటారుకొండలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న నాయకులు



తంగరడోణలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ శంకరమ్మ



ప్రజలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న జెడ్పీటీసీ లింగప్ప, నాయకులు



మొలగవల్లిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న గుమ్మనూరు నారాయణ స్వామి



ముగతిలో పార్టీ జెండా ఆవిష్కరణ పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చేసిన మేలును వివరించండి



మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న కృషిని ఇంటింటికీ వెళ్లి వివరించాలని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఒక ప్రకటనను విడుదల చేశారు. అందులో.. ప్రతి గ్రామ సచివాలయంలో పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ల ఆధ్వర్యంలో నిర్వహించాలని సూచించారు. పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరించి మళ్లీ వైఎస్సార్‌సీపీకే మద్దతు ఇచ్చేలా కృషి చేయాలని పేర్కొన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేయాలని సూచించారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించే వారికి మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి మళ్లీ వైఎస్ జగనన్న సీఎం కావాల్సిన ఆవశ్యకతను వివరించాలని ప్రకటన ద్వారా దిశానిర్దేశం చేశారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

హొళగుంద: రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ శ్రీనివాసులు ఆటో డ్రైవర్లు, వాహన చోదకులకు సూచించారు. మంగళవారం ఆయన హెబ్బటం గ్రామంలో రోడ్డు ప్రమాదాలు, సెల్‌ఫోన్ డ్రైవింగ్, లైసెన్సు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. వాహనాల్లో పరిమితికి మించి కూలీలు, ప్రయాణికులు, లగేజీని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే భారీగా జరిమానా విధిస్తామన్నారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు



ముగతిలో వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేస్తున్న అధికారులు

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పందన కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దని తహసీల్దార్ నిత్యానందరాజు సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. మంగళవారం ముగతి గ్రామంలో సర్పంచ్ విరుపాక్షిరెడ్డి నేతృత్వంలో మండల అధికారులు స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పందనలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. గ్రామంలో ఈ నెల 14వ తేదీన నబిరసూల్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందడంతో అతని భార్య షేక్ హసీనాకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలు అందజేశారు. సర్పంచ్ విరుపాక్షిరెడ్డి మాట్లాడుతూ.. మిగతా సొమ్ము రూ.4.90 లక్షలు నామినీ హసీనా బ్యాంక్ ఖాతాల్లో 15 రోజుల్లో జమ అవుతుందని చెప్పారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, ఎంఈఓ-2 రఘునాథ్, వైకేపీ ఏపీఎం చిన్న వీరన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాముడు, ఆయా శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోడౌన్ నిర్మాణానికి భూమిపూజ



ముగతిలో భూమిపూజ చేస్తున్న సర్పంచ్ విరుపాక్షి రెడ్డి

నందవరం: రైతు సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని ఆ పార్టీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు, సర్పంచ్ విరుపాక్షిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముగతి గ్రామంలో సహకార పరపతి సంఘం (సొసైటీ) స్థలంలో నందవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి అధ్యక్షుడు పరిమళ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శివారెడ్డిగౌడ్ ఆధ్వర్యంలో (బహుళ ప్రయోజన సౌకర్య గోదాము) గోడౌన్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం రూ.40 లక్షలను గోడౌన్ నిర్మాణానికి మంజూరు చేసిందన్నారు. రైతులు పండించే పంట దిగుబడులు నిల్వ చేసేందుకు ఈ గోదాము ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి రైతులకు అండగా నిలిచారన్నారు. ఆయా శాఖ అధికారులు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ



సోగనూరు రోడ్డులోని మద్యం దుకాణంలో స్టాకును పరిశీలిస్తున్న ఎక్సైజ్ సీఐ గౌరిప్రియ

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎంఆర్‌పీ ధరలకే మద్యం విక్రయించాలని ఎక్సైజ్ సీఐ గౌరిప్రియ ఆదేశించారు. మంగళవారం ఉదయం పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని స్టాక్‌ను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. నిత్య తనిఖీల్లో భాగంగా అన్ని దుకాణాల్లో విక్రయాలకు ముందు స్టాక్‌ను పరిశీలించినట్లు చెప్పారు. బాక్సుల్లో స్టాక్ సీల్ ఉందా, లేదా అని ప్రతి బాక్స్‌ను ఓపెన్‌ను చేసి చూస్తున్నట్లు తెలిపారు. మద్యం విక్రయాలతో పాటు, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా వచ్చిన మద్యం ఏమైనా విక్రయిస్తున్నారా అని పరిశీలిస్తున్నామన్నారు. మద్యం దుకాణాల్లో పనిచేసే వారు నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేసినా, అధిక ధరలకు విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు. సీఐతో పాటు ఎక్సైజ్ ఎస్‌ఐ బ్రహ్మయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి

మద్దికెర: పొదుపు పథకం ద్వారా ప్రభుత్వం అందించే రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఐకేపీ ఏపీఎం మధుబాబు అన్నారు. మంగళవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో వీఓఏలు, విఓబీలు, సీసీలకు మండల విజన్ బిల్డింగ్ ఫోర్స్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పొదుపు మహిళలకు సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా, జగనన్న తోడు పథకాలు అందిస్తోందన్నారు. గ్రామైక్య సంఘాలలో ఉన్న పొదుపు మహిళా సభ్యులు తీసుకునే రుణాల ద్వారా వ్యాపారవృద్ధి చేసుకుంటే మరిన్ని రుణాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రూపులు తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్రగాయాలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఆదోని బైపాస్ రోడ్డు నాగప్పల కట్ట ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన విద్యుత్ ప్రమాదంలో కుమార్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాంధీనగర్‌కు చెందిన కుమార్ నాగప్పల కట్ట ఎదురుగా ఉన్న ఫోటో స్టూడియోలోని వస్తువులను కిందకు దించుతున్నారు. స్టూడియోలో ఉన్న పెద్ద ఇనుప కడ్డీని కిందకు తీసుకొస్తుండగా పక్కన ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. పెద్ద శబ్దంతో కిందపడిపోవడంతో అక్కడున్న శరీరంపై నీటిని చల్లగా బొబ్బలు లేచాయి. గాయపడ్డ వ్యక్తిని 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నష్టపోయిన రైతుల జాబితా తయారు చేయండి

మద్దికెర: 2023 ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసి ఈ-క్రాప్ బుకింగ్ నమోదు చేయించుకున్న రైతులకు పంట నష్టపరిహారం కోసం జాబితా తయారు చేయాలని ఏఓ రవి సూచించారు. మంగళవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించిందని, పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, 1బీ జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ పత్రాలను స్థానిక రైతు భరోసా కేంద్రాలలో వీఏఏలకు గానీ, వీహెచ్‌ఏలకు గానీ అందజేయాలని సూచించారు. నేటి నుంచి జాబితాలను ప్రదర్శించడం జరుగుతుందని వెంటనే రైతులు తమ వివరాలు అందజేయాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మాచాని సోమప్ప జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన డి.మౌనిక అనే విద్యార్థిని 17 సంవత్సరాల్లోపు విభాగంలో ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తి మంగళవారం తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు అన్నమయ్య జిల్లాలోని రైల్వే కోడూరులో జరిగే పోటీల్లో విద్యార్థిని పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినితో పాటు ఆమెకు శిక్షణ ఇచ్చిన పీడీలు సుజనకుమారి, నాగేశ్వరిలను అభినందించారు.

మత్స్య పరిశ్రమకు ప్రోత్సాహం



వెల్దుర్తిలో ఫిష్ ఆంధ్ర రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ జి.సృజన, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): మత్స్య పరిశ్రమకు ప్రోత్సాహం, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం వెల్దుర్తి హైవేలో పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా ప్రభుత్వ ప్రోత్సాహంతో ఏర్పాటు చేసిన 'ఫిష్ ఆంధ్ర' సూపర్ రెస్టారెంట్, వెండింగ్ వెహికల్‌ను జిల్లా మత్స్య శాఖాధికారి శ్యామలతో కలిసి ప్రారంభించారు. 60 శాతం సబ్సిడీతో రూ.20లక్షల రెస్టారెంట్ యూనిట్ పొందిన వెల్దుర్తికి చెందిన లబ్ధిదారులు వెంకటేశ్వరమ్మ, కర్ణ దంపతులు, వేణుగోపాల్, చేపలు, రొయ్యల రవాణాకు ఉపయోగించేందుకు 40 శాతం సబ్సిడీతో రూ.20 లక్షల వెండింగ్ వెహికల్ (ఐదర్ ఫోర్‌వీలర్) పొందిన లబ్ధిదారుడు నర్సాపురం శీలం వెంకట కృష్ణారెడ్డి పాల్గొన్నారు. యూనిట్ల ప్రారంభం అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యేలు రెస్టారెంట్‌లోని పలు వంటకాలను రుచి చూశారు. వాహనం వద్ద పూజాది కార్యక్రమాలు నిర్వహించి లబ్ధిదారునికి అందించారు. ఆక్వా రైతులు సేకరించిన చేపలు, రొయ్యలను 'ఫిష్ ఆంధ్ర' బ్రాండ్ ద్వారా మార్కెట్లోకి అందుబాటులోకి తెచ్చి దేశీయ వినియోగం పెంచడం తమ లక్ష్యమన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, తహసీల్దార్ శివరాముడు, జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ, మత్స శాఖ ఏఎఫ్‌ఐ బాలరాజు, ఎఫ్‌బీఓ స్వర్ణలత, డీపీఎం రాజేష్, వీఎఫ్‌ఏ మంజుల, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం



జీ.ఎర్రగుడిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: జాతిపిత మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. జీ.ఎర్రగుడిలో రూ.83.34 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్, ఆర్‌బీకే, సచివాలయ భవనాలను వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రారెడ్డి, మండలాధ్యక్షుడు జిట్టా నాగేష్ యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, సర్పంచ్‌లు జిట్టా వరలక్ష్మి, బనావత్ లక్ష్మితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సచివాలయాలు, ఆర్‌బీకేల ఏర్పాటుతో మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామంలోనే అన్ని ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఎప్పటిలాగే టీడీపీ గ్రామాల్లో కక్షలు రేపేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దొంగ ఓట్లు చేర్పించి లబ్ధిపొందాలని చూస్తోందని పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టీడీపీ ఎన్ని కుతంత్రాలు పన్నినా వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనంతరం లక్ష్మితండాకు చెందిన దివ్యాంగుడు బలరాంనాయక్ వైద్య సాయం కోసం, జీ.ఎర్రగుడికి చెందిన వడ్డె రుతికకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.10.30 లక్షల చెక్కులను అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్నాథరెడ్డి, నారాయణనాయక్, పక్కీరప్ప, జిట్టా లక్ష్మీదేవి, హనుమంతు, టీఎండీ హుసేన్, మల్లికార్జునరెడ్డి, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామానికి చెందిన ఉలువ లక్ష్మన్న సోమవారం పాముకాటుకు గురై మృతి చెందిన విషయం విధితమే. మంగళవారం కర్నూలులోని ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాన్ని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి పరిశీలించి జరిగిన సంఘటనపై ఆరా తీసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గొర్రెల పెంపకందారుల సంఘం ఎన్నికలు

నందవరం: ముగతి గ్రామంలోని గోపాలకృష్ణ ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘానికి ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, కె.వికాస్‌తేజ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీన ఓటర్ జాబితాను ప్రదర్శిస్తామన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 95505 69230 ను సంప్రదించాలని కోరారు.